మూషికాల మూకదాడి

- ఎలకొట్టుడుతో వరికి అధిక నష్టం
- దిగుబడిపై ప్రభావం పడే అవకాశం

కాట్రేనికోన: వరి పంటపై మూషికాలు మూక దాడి చేస్తున్నాయి. దీనివల్ల చిరుపొట్ట దశకు చేరుకున్న పంట నాశనమవుతోంది. రసాయనిక మందులు వాడినా ఎలుకల నిర్మూలన సాధ్యం కాక పంటను కాపాడుకోవడానికి రైతులు ముప్పుతిప్పలు పడుతున్నారు. బుట్టలు పెట్టడం, పొగ పెట్టడం లాంటి చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. ఎలకొట్టుడు వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

రైతులకు అదనపు ఖర్చు

ఎలుకల నివారణ కోసం బొరియల వద్ద బ్రోమోడయోలిన్ మందులు, పొగ పెట్టినా, బుట్టలు పెట్టినా ఫలితం ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. సంతానోత్పత్తి అధికంగా ఉండటంతో నివారణ సాధ్యం కావడం లేదంటున్నారు. ఇప్పటికే పంట కాలువ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక తుపాన్లు, భారీ వర్షాలకు ముంపు నీరు సక్రమంగా దిగక రైతులు సాగు విస్తీర్ణం తగ్గించారు. కాట్రేనికోన మండలంలో 7,880 ఎకరాలకు గాను కేవలం 4,360 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు. చెయ్యేరు, బంటుమిల్లి,



కాట్రేనికోనలో ఎలుకల దాడిలో దెబ్బతిన్న వరి చేను

ఉప్పూడి, లక్ష్మీవాడ, కాట్రేనికోన, కుండలేశ్వరం, వేట్లపాలెం, గెద్దనపల్లి, కొప్పిగుంట, నడవపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు తదితర ప్రాంతాల్లో



వేట్లపాలెంలో ఎలుక కొట్టివేసిన వరి దుబ్బులు చూపిస్తున్న రైతు

ఎలుకలు మూకదాడి చేయడంతో వరి చేలు దెబ్బతిన్నాయి. ఎకరం వరి చేనుకు సరాసరి 20 నుంచి 25 వరకూ బొరియలలో ఎలుకలు ఉండటంతో సుమారు 15 శాతం వరకూ పంట నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఎలుకల నివారణకు ఎకరానికి రూ.6 వేలు నుంచి రూ.7 వేలు ఖర్చు చేస్తున్నా నివారణ సాధ్యం కావడం లేదన్నారు.

ఎలుకల్లో అధిక సంతానోత్పత్తి

ఎలుకల్లో అధిక సంతానోత్పత్తి సామర్థ్యం ఉండటంతో నివారణ సాధ్యం కావడం లేదు. ఎలుకల జీవిత కాలం రెండేళ్ళు మాత్రమేనని కాని ఆడ ఎలుక పుట్టిన 35 రోజుల నుంచి సంతానోత్పత్తికి అవసరమైన సామర్థ్యం కలిగి ఉంటుంది. ఎలుకలు ఒక కాన్పుకే సరాసరి ఏడు పిల్లల వరకూ పెడుతుంది. ఒక జత ఆడ, మగ ఎలుకలు జత కట్టిడంతో ఏడాదికి సుమారు 800 నుంచి 1200లు వరకూ పిల్లలు పుడతాయని అధికారులు చెబుతున్నారు.

సామూహిక ఎలుకల నివారణకు చర్యలు



ఎలుకల సామూహిక నివారణకు చర్యలు చేపట్టాం. ఎకరానికి బ్రోమోడయోలిన్ 4 గ్రాములు, వరి నూక 192 గ్రాములు, నూనె 4 గ్రాములు కలిపి 10 గ్రాములు చొప్పున 20 పొట్లాలు కట్టి ఎలుకల బొరియల్లో పెట్టాలి. ఎలుకల నివారణపై పొలం బడిలో అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ఎలుకల మందును ఉచితం పొందొచ్చు.

– ప్రవీణ్ కుమార్, ఏఓ

పంట నాశనమవుతోంది



ఏటా కంటే ఈ ఏడాది ఎలుకల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ఎలుకలు అధిక సంఖ్యలో వరి చేలపై దాడి చేయడంతో పంట నాశనమవుతోంది. ఎలుకల నివారణ కోసం బ్రోమోడయోలిన్ మందుతో పాటు పొగ పెట్టడం, బుట్టలు పెట్టేందుకు అధిక మొత్తంలో ఖర్చు చేసినా ఫలితం కనిపించడం లేదు.

– శీలం సూర్యనారాయణ, వేట్లపాలెం, రైతు

క్లుప్తంగా

సీతారాములకు పవలింపు సేవ



వానపల్లిపాలెంలో పవలింపు సేవలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెంలో శ్రీసీతారామచంద్ర మూర్తికి ఆదివారం సాయంత్రం పవలింపు సేవ, సోమవారం ఉదయం ప్రభాతసేవ నిర్వహించారు. ఆది గణపతి నవరాత్ర ఉత్సవాలలో భాగంగా గ్రామంలో 72 గంటల పాటు త్రైయాకాహ మహోత్సవం జరిపారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ జరిపి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అర్చకుల గృహాలకు రూ.50 వేల విరాళం



రూ.50 వేల విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల వసతి గృహాలకు ముమ్మిడివరానికి చెందిన యండమూరి వెంకట కృష్ణారావు, వీర వెంకట రమణ కుమారి దంపతులు రూ.50 వేల విరాళం సమకూర్చారు. ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దాతలు ఈ విరాళాన్ని పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్త నడింపల్లి వర్మ, అర్చకుడు పెద్దింటి వీబీఎస్ ఆచార్యులకు అందజేశారు.

ఎస్బీ సీఐగా రాజశేఖర్

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) సీఐగా పని చేస్తున్న కోలా రజనీకుమార్ బదిలీ అయ్యారు. ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ దిశ సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్ నియమితులయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి రజనీకుమార్ ముగ్గురు ఎస్పీలు సుబ్బారెడ్డి, సుధీర్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌ల వద్ద ఎస్బీ విభాగంలో సమర్థవంతంగా పనిచేశారు. గతంలో అమలాపురం పట్టణ సీఐగా పనిచేసిన ఆయన అదే అనుభవంతో కొత్త జిల్లా ఆవిర్భావం నుంచి జిల్లా ఎస్బీ కార్యాలయంలో పనిచేస్తున్నారు.

అనధికార ఆక్వా సాగుపై ఫిర్యాదు



నదీ పాయ మీదుగా అనధికార చెరువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం బ్రిడ్జికి ఆనుకుని ఉన్న 32 ఎకరాల పట్టా భూముల్లో అనధికారికంగా ఆక్వా సాగుకు ప్రయత్నాలు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన మత్స్యకారులు అమలాపురంలోని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్.పల్లిపాలెం పరిధిలోని రొయ్యల చెరువుల నుంచి నదీ పాయ మీదుగా అనధికార చెరువుల వద్దకు కేబుల్ ఏర్పాటుచేసి ఆక్వా సాగు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాగుదారులకు విద్యుత్ అధికారులు నోటీసులు జారీచేసినా ఖాతరు చేయడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, ఏ.శ్రీను, మల్లాడి నరేష్, గోవిందరాజు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సమాచారం చెబితే రూ.5 వేల నజరానా

కాట్రేనికోన: మండలంలోని గొరగనమూడి సెంటరులో ఈ నెల 24 తెల్లవారుజామున దొంగతనానికి గురైన ఏపీ05టీఎఫ్1799 నెంబరు మహీంద్ర ఆల్ఫా ప్లస్ ట్రక్ ఆటో సమాచారం తెలిపిన వారికి రూ.5 వేల బహుమతి ఇస్తామని కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తులో సదరు ఆటో అమలాపురం, ఈదరపల్లి బ్రిడ్జి మీదుగా అంబాజీపేట వైపు వెళ్లినట్లు గుర్తించామన్నారు. సదరు ఆటో ఆచూకీ తెలిస్తే 94409 00774 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శిగా నాయుడు



ఎస్వీ నాయుడు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అమలాపురానికి చెందిన ఎస్వీ నాయుడు ఎన్నికయ్యారు. కాకినాడ సూర్య కళా మందిరంలో ఆదివారం జరిగిన ఏపీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆయన ఎన్నికపై అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు జేఎన్ఎస్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీవీవీ సత్యనారాయణరాజు, కోశాధికారి ఎం.ఆశీర్వాదం హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఉప్పలగుప్తంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం పరిధిలోని చీకట్లపాలెంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కాపు మహిళలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కాపు నేస్తం పథకాన్ని తీసుకొచ్చి ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేల రూపాయలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలకు ఆసరా రూపంలో దఫదఫాలుగా రుణమాఫీ చేస్తున్నారని



ఉప్పలగుప్తంలో సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారుకు వివరిస్తున్న పినిపే శ్రీకాంత్

చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, మోటూరి సత్యంకాపు, పోతుమూడి కొండబాబు, చీకట్ల రెడ్డినాయుడు, తోలేటి రామ్‌కుమార్, నల్లా కిషోర్, పెయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంతం భూమిని కాపాడాలని ధర్నా

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు జెల్లావారిపేటలో 50 సెంట్ల గ్రామ కంతం భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతూ పలు సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాకినాడకు చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం తనదంటూ ప్రైవేటు సర్వే చేయించడానికి ప్రయత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్నారన్నారు. కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

అధ్యక్షుడు పెయ్యల రమేష్, వడ్డి ఏడుకొండలు, పి.గోపాలకృష్ణ, ఎన్.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత ఆశయాల దిశగా అడుగులేయాలి

ఐ.పోలవరం: యువత కృషి, పట్టుదలతో ఉన్నత ఆశయాల దిశగా అడుగులేయాలని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. సోమవారం మురమళ్లలో యూపీఎస్సీలో 102వ ర్యాంకు సాధించిన ఆకెళ్ళ చైతన్య మాధవ్‌కు అతడి మిత్రుడు హరీష్ నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశే రాజబాబు మాట్లాడుతూ ఆకెళ్ల చైతన్య మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆకెళ్ల చైతన్య మాధవ్‌ను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మురమళ్ళ వీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పెన్మత్స వాసురాజు, దేవస్థానం అర్చకులు



సత్కార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకెళ్ళ చైతన్య మాధవ్

యనమండ్ర రాంబాబు, వైద్యులు జంధ్యాల సీతారామారావు, శ్రీనివాసరాజు, సూర్యవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం



మురమళ్లలో ప్రత్యేక అలంకరణలో ఉన్న గజాననుడు



శ్రీరామ్‌నగర్‌లో నిర్వహిస్తున్న అన్నదానం

ఐ.పోలవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గణపతిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో కొలువుదీరిన వినాయకునికి సోమవారం లక్ష్మీగణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గణపతి పందిరిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

శ్రీరామ్‌నగర్‌లో అన్నదానం

తాళ్లరేవు: గణపతి నవరాత్ర వేడుకలలో భాగంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలోని శ్రీరామ్‌నగర్‌లో బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేలంలో రూ.9,500 పలికిన లడ్డూ

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కొండాలమ్మ చింత జీఎంసీ బాలయోగి కాలనీలో గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి సమర్పించిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో లడ్డూను గ్రామస్తుడు రెడ్డి చంద్ర దిలీఫ్ రూ.9,500కు దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు మెండి నాని, రెడ్డి సతీష్, సీహెచ్ ప్రసాద్‌లు లడ్డూను చంద్ర దిలీఫ్‌కు అందజేశారు.



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న చంద్ర దిలీఫ్

పాటల సీడీ ఆవిష్కరించిన కలెక్టర్

అమలాపురం రూరల్: తాగునీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ముమ్మిడివరం ఎంపీడీవో జె.రాంబాబు రూపొందించిన పాటల సీడీని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం తన సమావేశపు హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాననీటి సంరక్షణ, తాగునీటి పొదుపు విషయంలో మనందరం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటి సంరక్షణపై పౌరులందరి బాధ్యతను గుర్తు



పాటల సీడీని ఆవిష్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

చేస్తూ రూపొందించి పాటలు బాగున్నాయని ప్రశంసించారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

ఐ.పోలవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఈ నెల 30 నుంచి జగనన్న సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్న నేపథ్యంలో మండలంలోని జి.వేమవరం, కేశనకుర్రు పీహెచ్‌సీల పరిధిలోని సిబ్బంది ఇంటింటా అనారోగ్య బాధితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మురమళ్ల, పశువుల్లంక, ఐ.పోలవరం, కేశనకుర్రు-3, తిళ్లకుప్ప గ్రామాల్లో వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు టోకెన్లు పంపిణీ చేసినట్లు వైద్యులు ఆదిత్య పవన్ తెలిపారు.

అల్లవరం సీహెచ్‌సీలో వైద్య శిబిరం

అల్లవరం: అల్లవరం సామాజిక కేంద్రంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సూపరింటెండెంట్ మౌనిక ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు, కళ్లు, ఎముకల విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ద్వారా వారానికోసారి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మౌనిక తెలిపారు. రోగుల అవసరాన్ని బట్టి మెరుగైన వైద్య సేవల కోసం ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ సేవలను సూచిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గీతిక, రాకేష్, అమృత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, జల్లి శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ మౌనిక తదితరులు

శరన్నవరాత్ర వేడుకలకు రాట ముహూర్తం

యానాం: శరన్నవరాత్ర వేడుకల నిర్వహణకు సంబంధించి స్థానిక పడవలరేవులో వేంచేసియున్న శ్రీలలితాదేవి మందిరం వద్ద ఆలయ అర్చకులు మానేపల్లి గణపతి ఆధ్వర్యంలో సోమవారం రాట ముహూర్తం చేశారు. వచ్చే నెల 15వ తేదీ ఉదయం 8.50 నిమిషాలకు కలశస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి రాంపండు, బేతాళం కుమార్, సత్యవరపు నూకరాజు, నాగేశ్వరావు, కాలే సాయినాథ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘ కార్యాలయం వద్ద చేతివృత్తులదారులు సోమవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతివృత్తులవారికి 18 రకాల ప్రయోజనాలు చేకూర్చుతున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకంలో బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, పాటి వెంకట్రామయ్య, దంగేటి రామకృష్ణ, నాదెళ్ల వీరభద్రం, షేక్ కరీముల్లా బాబా తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి

అమలాపురం రూరల్: కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతోనే కోనసీమ అభివృద్ధి జరుగుతుందని లీడ్ బ్యాంకు మేనేజర్(ఎల్‌డీఎం) శ్యాంకుమార్ అన్నారు. మండలంలోని జనుపెల్ల గ్రామంలో నాబార్డు ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై స్థానిక మహిళలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన తర్వాత సొంతంగా యూనిట్లు పెట్టుకునే మహిళలకు రుణ సదుపాయం అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, ట్రైనర్ సేతు రమేష్, గెద్దం సీత తదితరులు పాల్గొన్నారు

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

అల్లవరం: ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గణపతి నిమజ్జనాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ హరీష్ సోమవారం తెలిపారు. డి.రావులపాలెం ఎంపీపీ పాఠశాలలో స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నిమజ్జనాల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల గ్రామంలో ఫ్లెక్సీ వివాదం చోటు చేసుకున్న నేపథ్యంలో స్థానికులతో ఎస్ఐ సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తిక్కా ప్రసాద్, కొమ్ముల నాగభూషణం, తిక్కా లక్ష్మణరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడిగా సెల్వ గణపతి

యానాం: పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నుంచి ఆదేశాలు అందాయని సెల్వ గణపతి విలేకరులకు తెలిపారు. పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రూ.31,000 ఆర్థిక సాయం

అమలాపురం రూరల్: అనారోగ్యంతో కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అంబాజీపేట అసోసియేషన్ సీనియర్ సభ్యుడు అజయ్ కుమార్‌కు కోనసీమ జిల్లా ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.31 వేలు ఆర్థిక సాయం సమకూర్చారు. జిల్లా సభ్యుల నుంచి రూ.19,500, పట్టణ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, ప్రకాశం జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ హేమంత్‌కుమార్ ఏర్పాటుచేసిన సహాయనిధి నుంచి వచ్చిన మొత్తం రూ.11,500 కలిపి మొత్తంగా రూ.31 వేలు అజయ్‌కుమార్ దంపతులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, ఖ్వాజా బాబు, నగేష్, సత్య ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వృద్ధుడు

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని 80 ఏళ్ల వృద్ధుడు అపస్మార స్థితిలో పడి ఉండడాన్ని వైద్యులు గుర్తించారు. అతడిని ఆసుపత్రిలోకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అతడి పరిస్థితిని వివరిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పని భారం తగ్గించాలంటూ వినతి

అమలాపురం రూరల్: జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులపై పడుతున్న పని భారాన్ని తగ్గించాలని కోరుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, కార్యదర్శి మల్లేష్, సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి సాయిబాబు, స్వామినాయుడు, హర్ష, మీరా పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు సత్కారం



మంతి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న వ్యాపార వర్గాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీఆది గణపతి వర్తక సంఘం (బులియన్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటైన షరాబుల చవితి పందిరిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం సందర్శించి స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, రేకపల్లి సూరిబాబు, చింతలపూడి సత్తిబాబు తదితరులు స్వాగతం పలికి సత్కరించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మద్దింశెట్టి ప్రసాద్, గునిశెట్టి రమణలాల్ తదితరులున్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడలపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఆడుదాం ఆంధ్ర క్రీడలపై మండల విద్యాశాఖాధికారులతో ఎంపీడీఓ కృష్ణమోహన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాయలంలో జరిగిన సమీక్షలో క్రీడల నిర్వహణ, క్రీడా మైదానాలు, క్రీడాకారుల ఎంపిక, బహుమతుల ప్రదానం తదితర విషయాలపై చర్చించారు. మండలంలోని 23 సచివాలయాలు పరిధిలోని 484 మంది ఆడుదాం ఆంధ్రలో పేర్లు నమోదు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా క్రీడామైదానాల ఎంపికలో శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కిరణ్ బాబు, ఏడుకొండలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టులు నిర్మించాలని రైతుల విజ్ఞప్తి

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో రూ.1.80 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బొడ్డువానిలంక-పాత కోరంగి రహదారిలో రైతాంగానికి సాగునీరు కోసం ఏర్పాటుచేసిన తూరల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కల్వర్టులను నిర్మించాలని సోమవారం స్థానిక రైతులు వేగిరాజు రామరాజు, మేడిశెట్టి కృష్ణ, చంద్రాల బుజ్జి తదితరులు కోరుతున్నారు.

ఏఎంసీ చైర్మన్ కుడిపూడికి సత్కారం



కుడిపూడి శివన్నారాయణను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

ముమ్మిడివరం: స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణను శెట్టిబలిజ సంఘ నాయకులు సోమవారం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శివన్నారాయణ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, రెడ్డి హేమసుందరి, రెడ్డి శివన్నారాయణ, సానబోయిన మల్లిఖార్జునరావు, దొమ్మేటి రమణకుమార్, పంపన రామకృష్ణ, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.